


కమాల్ పుట్టినప్పుడే వాళ్ళమ్మకు దుఃఖం కలిగించాడు. ఛిల్లా (నలుబదవ రోజు చేసే పండుగ) పండుగరోజు వచ్చిన చుట్టాలంతా బిడ్డ చాలా అందంగా ఉన్నాడన్నారు. కాని ఫాతిమా ఉలుకూ, పలుకూ లేకుండా కూర్చుంది.

“ఏమయింది అపాజాన్? బంగారం లాంటి బేటా కొంచెమయినా నీ చెహరాలో (మొహంలో) ఖుషీ కనిపించదే?’ అని అడిగింది. ఫాతిమా చెల్లెలు ఫరీదా ఆమె పొరుగూరునుండి ప్రత్యేకంగా ఈ పండుగకని వచ్చింది.

“ఏం చెప్పాలి ఫరీదా ఇప్పటికే చార్ బేటా ఉన్నారు. పాంచ్‌వా బేటీ అనుకున్నాను. కాని కిస్మత్ బాగాలేదు’’ అంటూ నిట్టూర్చింది.

“భాయీజాన్‌కు ఖుష్‌లేదా?’’ (బావ గారికి సంతోషంగా లేదా) అని అడి

గింది. ఫరీ వా.

"ఉస్ కీ ఫికర్ మత్ కరో జో హూవా సో హూ" (వాడి గురించి పట్టించుకోకు జరిగిందేదో జరిగింది) అంటూ గొణిగింది. షేక్ అమీర్ తల్లి తన మనవణ్ణి ముద్దులాడుతూ.

షేక్ అమీర్‌తోపాటు ఇంటిల్లిపాదీ ఆశించారు ఆడపిల్ల పుడుతుందని. ఒకానొక సందర్భంలో షేక్ అమీర్ ఫాతిమాను బెదిరించాడు.

'ఈసారి ఆడబిడ్డ కలక్క పోతే నీతో ... ట్లాడనని!'

నిజంగానే కమాల్ పుట్టినప్పుడు పది రోజులపాటు అటువైపు ముఖమయినా చూపించలేదు షేక్‌సాబ్. ఛట్టీ (నామకరణం) పండుగ రోజుకూడ ఏదో అయిందనిపించాడు. కాని పిల్లవాని ముఖం సరిగా చూడనయినా లేదు. ఫాతిమా కన్నీళ్ళతో బతిమిలాడి ఎన్నో విధాల క్షమాపణ కోరుకొంది. అవకాశముంటే ఇంకోసారికి తప్పక కూతురినిస్తానని కూడ మాటిచ్చింది. అప్పటికి గాని షేక్ పెదవులపై చిరునవ్వు కనిపించలేదు.

ఈ రోజు ఛిల్లా పండుగ కూడ మామూలుగానే జరిగింది. షేక్‌సాబ్‌కు ఏ మాత్రం ఉత్సాహమున్నట్లే లేదు. అందరూ మిఠాయిలు తిని షర్బత్ తాగి పిల్లవాడికి బహుమతులిచ్చి వెళ్ళిపోయారు.

* * *

కమాల్‌కు రెండేండ్లు నిండాయి. కాని ఫాతిమాకు ఇంకో బిడ్డ పుట్టేసూచన కనిపించలేదు. మనసులోని లోటు తీర్చుకోటానికా అన్నట్లు ఒకటే. అరచెయ్యి ఫ్రాకులు కొని కమాల్‌కు తొడుగుతూ ఉండేది. ఆ రోజుల్లా తల్లి, తండ్రీ తెగసంబరపడేవారు.

"ఖూబ్ సూరత్ లడకా హై. అందమైన కుర్రాడు) అంతా నీ శకలే పోలికె) అల్లా కాస్త చల్లగా చూసుంటే వీడూ లడికీ అయ్యేవాడు: థోడా మేఁ తిప్పిపోయింది." అని నిట్టూర్చాడు షేక్ అమీర్.

ఫాతిమా తప్పుచేసినట్టు తలవంచుకొంది.

"ఛోడ్‌దో పగ్‌లీ ఇన్‌కో లడ్‌కీ సమ్‌ఝ్" (పోనీలే వీడినే అమ్మాయి అనుకో) అని ఊరడించాడు చివరకు.

కొన్నాళ్ళకు ఈ ముచ్చట్లూ ఆగిపోయ్యాయి కమాల్ స్కూలుకు పోతున్నాడు. వాడి నొక్కుల జుత్తు, పెద్ద పెద్ద కళ్ళు, ఎర్రటి చిన్ని పెదవులు, గులాబీరంగు బుగ్గలు చూస్తుంటే మద్రసాలో (స్కూల్లో) ఉస్తాదుగార్కి (టీచరుకు) కూడ వాణ్ణి ముద్దుపెట్టుకోవాలనిపించేది.

కమాల్ చూడాటానికి సన్నగా. పీలగా ఉన్నా చాలా చురుగ్గా ఉండేవాడు స్కూల్లో ఆటలన్నీ వాడివే. ఎప్పుడూ

గెంతుతూ, దూకుతూఉంటాడు. ఇంట్లో కూడ వాని అల్లరి అన్నలను మించి పోయేది. చిన్నవాడుకదా అని ఏమీ అనేవారు కాదు. ఒక్కొసారి బాగానే తగల్నిచ్చేవారు. అమ్మదగ్గర ఫిర్యాదు చేస్తే ఆమె తన దుపట్టాతో వాడి కన్నీళ్ళు తుడిచేది. కాని కమాల్ అల్లరికి అంతూ పొంతూ ఉండేది కాదు.

ఫాతిమా ఇంటికి నాలుగిండ్ల అవతల ఉన్న కన్నాంబగారు ఒకరోజు వంటింట్లో పనిముగించుకొని ఇవతల గదిలోకి వచ్చే సరికి అలమార్లో దేవుడి పటంముందు పెట్టిన జామపండు తీసుకొంటూ ఒక చిన్న కుర్రాడు కనిపించాడు. అలమారు అందుకోటానికి ఒక మోడాకూడ వేసు కొన్నాడు

కన్నాంబ అలాగే తెల్లబోయి నిల్చుంది. ఈమెను చూసి కుర్రాడు పరుగందుకోబోగా ఈవిడ చెయ్యిపట్టి ఆపింది.

"ఎవరబ్బాయివి నీవు ?

వాడేం మాట్లాడకుండా గబగబా జామ పండు నోట్లో కుక్కుకొంటున్నాడు.

"నిన్నే అడుగు తున్నది. బంగారు బాబువి కదూ. చెప్పు నాన్నా ఎవరబ్బా యివి ?" ఆమె కళ్లలో సన్నటి నీటి పొర. ఇది రేపల్లెలా, వాడు చిన్ని గోపాలకృష్ణునిలా, తాను యశోదలా ఒక్క క్షణం మైమరచి పోయింది. కన్నాంబ. ఆ కుర్రాణ్ణి మరింతగా దగ్గరకు లాక్కొంటూ,

"చెప్పు కన్నా" అంది.

"నా పేరు కమాల్" అన్నాడు వాడు.

"కమల్ ! ఎంత మంచి పేరు !"

"కమల్ నహీఁ కమాల్."

"అంటే., ఈ పేరెప్పుడూ వినలేదే

"ఎవరబ్బాయివి ?"

"ఫాతిమా కొడుకును" జామపండు లోని ఆఖరి ముక్క నోట్లో వేసు కొన్నాడు.

"ఓరినీ..కన్నాంబ మనస్సు కలుక్కు మంది.

కమాల్ ఎంగిలి చేయి చొక్కాకు తుడుచుకొన్నాడు. వాడి పెద్దటి నల్ల కళ్ళలో ఏ మాత్రం భయంలేదు. ఎవ రయితేనేం? చిన్నబిడ్డ దేవుడితో సమానం అనుకొంది కన్నాంబ.

"మా ఇంట్లోకి ఎవరినడిగి వచ్చావు" అంది కొంచెం బెదరింపుగా.

"దర్వాజా తీసుంటే వచ్చాను"

"అలా ఎవరింట్లోకైనా వెళ్ళి పోవ టమే, పైగా జామపండు దొంగలించావు."


"క్యా"

"జామపండు తినేశావు"

"అమ్రూద్, హాఁ పూరా తినేశా"

ఇక వీడితో లాభం లేదనుకొంది కన్నాంబ.

"ఇంకెప్పుడూ అలా చెయ్యవు కదూ"




"కభీ నహీఁ. భూఖ్ లగీతో (ఆకలి వేస్తే) చేస్తాను"

ఆ మాటలకు నవ్వొచ్చింది కన్నాంబకు. గట్టిగా ముద్దు పెట్టి వానికి డబ్బాలోని బిస్కెట్లు పెట్టింది. ఒకే పరుగు పెట్టాడు.

ఒకసారి రెండు వీధుల కవతల కాథరిన్‌గారి ఇంటివెనుక గులాబీలు కోసుకొంటూ పట్టుపడ్డాడు కమాల్.

"ఏయ్ ఎవరా పూలుకోసేది.? అని కేక బెట్టింది కాథరిన్.

వీడు ఉలుకూ, పలుకూ లేకుండా కోస్తూనే ఉన్నాడు. కాథరిన్ తలుపు తీసుకొని వచ్చేసరికి నోట్లో వేలు పెట్టుకొని చీకుతున్నాడు.

"ఏం చేస్తున్నావ్" అంది కాథరిన్ కోపంగా.

"ముల్లూ గుచ్చింది. ఖూన్—మరలా వేలు నోట్లో పెట్టుకున్నాడు.

"నిన్నసలు రోజాలు ఎవరు కోయమన్నారు ?"

"ఎవరూ లేదు. అమ్మాజాన్ గులాబ్ పసంద్ చేస్తుంది.

"అలా అడక్కుండా కోయవచ్చా ? నాటీబాయ్''

"ఇన్ని పూలున్నాయి అమ్మాజాన్‌కి ఒకటీ ఏం,'' ఎడమచేతిలోని పువ్వు బుగ్గమీద పెట్టుకొని ఒప్పిస్తున్నట్టుగా అన్నాడు.

ఆ పళాన కమాల్‌ను ఎత్తుకుని ముద్దులతో నింపేసింది. కాథరిన్ "మా ఇంటికివస్తూ ఉండు. మా ఇంట్లో ఒక పాప ఉంది. ఎలిజా. స్నేహం చేసుకొంటావుకదూ.''

"క్యా?"

"ఎలిజాతో దోస్తీ''

సరేనని తలాడించి ఆమెతోపాటు ఇంట్లోకి నడిచాడు కమాల్.

చాలా సార్లు ఇరుగు పొరుగులు కమాల్‌పై ఫిర్యాదులుకూడా చేసేవారు. మా ఇంట్లో గడియారంవిరగ్గొటాడంటే, మా ఇంట్లో పుస్తకం చింపేశాడని, మా కుర్రాడిని కొట్టాడని ఒకరంటే, మా పిల్ల రిబ్బను దాచేశాడని మరొకరు — ఇలాగే ఈ మాటలు వినలేక వీడు ఆడపిల్లయినా కాకపోయాడు. ఇంట్లో కాస్త అణిగి, మణిగి ఉండేవాడని నిట్టూర్చేది ఫాతిమా. అప్పుడప్పుడూ వానికి దేహశుద్ధిహ కూడ చేసేది.

ఇప్పుడు కమాల్ తొమ్మిదవ తరగతి పాసయి పదో తరగతికి వచ్చాడు. వయస్సుతోపాటు వాని అల్లరి పెరిగిందే కాని తగ్గలేదు. ఒక్కక్షణం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఉరుకులూ, పరుగులే. కుర్రాడికి పద్నాలుగో ఏడు వచ్చింది. బుగ్గలు నునుపెక్కాయి. ముఖం మరింత మృదువుగా తయారయింది మాటలో మాధుర్యం హెచ్చింది. నెలకు రెండు సార్లయినా క్రాపు చేయించాల్సి వస్తుంది. ఒకటి రెండుసార్లు వాడుఅల్లరిగా వాళ్ళమ్మ దుపట్టా భుజాల మీద వేసుకోవటం, మేలిముసుగు వేసుకొని అద్దంలో చూచుకోటం షేక్ అమీరు కళ్లలో పడింది. ఇంత వయసొచ్చింది ఇంకా పిల్లచేష్టలేమిటని కోపపడ్డాడు. కమాల్ ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయేవాడు. ఒకసారి తనకు గుండెల్లో నొప్పిగా ఉందని వాళ్ళమ్మతో చెప్పాడు. ఆమె కంగారు పడింది.

"ఛాతీ అంతా నొప్పే" అన్నాడు.

"ఏదేనా మలామ్ రాస్తానుండు" అంటూ ఫాతిమా లోపలికి వెళ్ళింది

కమాల్ చొక్కాతీసి బనీనుమీద పడుకొన్నాడు. ఫాతిమా సీసాతో వచ్చి అలాగే నిల్చుండి పోయింది. ఆ రాత్రి భర్తతో ఏదో గుసగుసలాడింది. షేక్ సాబ్ వారం రోజులపాటు కమాల్‌ను పరీక్షగా గమనిస్తూవచ్చాడు ఆ తర్వాత

"కమాల్ బేటా, దర్ద్(నొప్పి) ఎట్లా వుంది?" అని అడిగాడు.

"ఏమీ దర్దు?"

"ఛాతీ కా" (గుండెల్లో)

కమాల్ ఎర్రటి బుగ్గలు మరింత ఎర్రబడ్డాయి.

"దవాఖానాకు పోదాం వస్తావా ?"

తండ్రితో పాటు బయలుదేరాడు కమాల్.

డాక్టరు సయ్యద్ అరగంట పైగా కమాల్‌పై పరీక్షలు జరిపాడు. తర్వాత షేక్‌సాబ్‌తో ఏకాంతంగా మాట్లాడుతూ "భాయీ సాబ్, ఈ కేసు అజీబ్‌గా (విచిత్రంగా) ఉంది. కమాల్‌కుకొన్నాళ్ళు నేను దవా ఇస్తాను. ఒక నెల పోయిన తర్వాత చెబుతాను."

డాక్టరుగారు హార్మోను ట్రీట్‌మెంటు ప్రారంభించారు కమాల్‌లో ఆడపిల్ల

లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఫాతిమాకు ఒకే కంగారుగా వుంది. కమాల్‌ను స్కూలు మాన్పించేశారు. నెల రోజులు కాగానే షేక్ సాబ్‌తో డాక్టర్ స్పష్టంగా చెప్పారు. "కమాల్ ఇప్పుడు పూరా లడ్‌కీ. ఇలాంటి కేసులు కొన్ని ఉన్నాయి. మీరు కమాల్‌ను ఢిల్లీకి తీసుకు పోవాలి. నేను నా దోస్తు హరిశ్చంద్రకు ఖత్ వ్రాస్తాను. ఆయన ఆపరేషన్ చేస్తారు, దాంతో మీకు బేటా బదులు బేటీ దొరుకుతుంది. అసలీ బేటీ" అంటూ పరాచికంగా నవ్వారు.

షేక్ అమీర్ కమాల్‌తో ఢిల్లీ ప్రయాణం పెట్టారు. ఆయన బాగా చదువుకొన్నారు కాబట్టి తన కొడుకుకు వచ్చిన సమస్య అర్థమయింది. ఫాతిమాకే అర్థం కాలేదు. వానిలో స్త్రీ హార్మోన్లు ఎక్కువగా ఉన్నాయని, అందుకే మగపిల్లవాడిగా కంటే, ఆడపిల్లగా వాడు సుఖపడతాడని, ఇందుకు తగిన ఆపరేషన్ ఢిల్లీలో చేయించాలని ఆయన విడమరచి చెప్పేసరికి ఫాతిమా నెత్తి కొట్టుకొని ఏడ్వసాగింది.

"క్యోం రోతీహో బేగం. (ఎందుకు ఏడుస్తావు?) అల్లాకు నీ దువా (ప్రార్థన) వినిపించింద' అని ఊరడించాడు షేక్ అమీర్.

ఢిల్లీలో రెండు నెలలు మకాం పెట్ట వలసి వచ్చింది. అన్ని పరీక్షలూ అయ్యాయి. ఆపరేషన్ ముగిసింది. కమాల్ ఇప్పుడు బేనజీర్‌గా మారింది. బజార్లో రెండు జతల షెల్వార్, కమీజులు దుపట్టాలు కొన్నాడు షేక్ అమీర్. మొదట ఆ డ్రెస్సు వేసుకోటానికి కొద్దిగా సిగ్గుపడింది బేనజీర్. కాని ఆ దుస్తుల్లో తనను తాను చూచుకొని తెగ మురిసిపోయింది. ఇక తిరుగు ప్రయాణంలో జనానా పెట్టెలో కూర్చుని తానుపడిన ఇబ్బంది చెప్పనక్కరేలేదు.

ఫాతిమా తన కూతుర్ని కళ్ళారా చూసుకొంది. మనసారా ముద్దు పెట్టుకొంది. కన్నీళ్లు తుడుచుకొంటూ "నా బేటీ వెళ్ళిన ఇంట్లో షమ్మా జలాయించే జరూరత్ (దీపం వెలిగించే అవసరం) లేదు" అంది.

"ఇస్ కా నామ్ నూర్జహాన్ రఖో యహ్ నూర్ హై నూర్ (దీని పేరు నూర్జహాను అన్నాడు. ఇది కాంతిపుంజం అంది మూసుకున్న మునసమ్మ కళ్ళు చిట్లించి మనవరాలివి చూస్తూ.

ఆ సాయంత్రం బేనజీర్ ఏమాత్రం సంకోచం లేకుండా మామూలుగా బయటకు వెళ్ళబోతే "ఎక్కడికి" అని అడిగింది ఫాతిమా.

"దోస్తు మోహన్ ఇంటికి"

ఫాతిమాకు నోట్లో మాట పెగల్లేదు. "బేటీ ఇప్పుడు నువ్వు లడ్‌కా కాదు. లడికీవి. అకేలీ కభీ బాహర్ నహీం జానా (ఎప్పుడు ఒంటరిగా బయటకు

వెళ్ళకూడదు) నా తో ఎక్కడికయినా తీస్కు పోతాను. తబ్ భీ మన కూ ఖురఖా ఉండాలి. ఘర్మ్కా మెహమాన్ (ఇంటికి చుట్టాలు) వస్తే నా తో పా టు నీవూ పర్దాలో ఉండాల. వెనకటి షరారత్ అబ్ బంద్ కర్‌నా (అల్లరి మానేయ్యాలి) బేటీ" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది ఫాతిమా.

బేనజీర్ శిలాప్రతిమలా నిల్చుంది పాయింది. ప్రపంచం గిరగిరా తిరుగుతున్నట్లుంది. తనలో వచ్చిన ఆ విచిత్రమయిన మార్పును కూడా సహజంగా తీసుకొంది. కాని ఆ మార్పు మూలంగా వచ్చిన ఈ ప్రతిబంధకాలను, క్రొత్తగా పడిన ఈ ఇనుప సంకెళ్ళను ఎలా సహజంగా తీసుకోవాలో పిలవాడిగా ఉండిన ఈ పిల్లకు అర్థం కాలేదు. పచ్చని చెట్లు, నీలాకాశం చల్లని గాలులు, తాను ఆడిన ఆటలు, తిరిగిన ప్రదేశాలు చేసిన స్నేహాలు ఇవన్నీ తనకిక అందని పండ్లే. ఆ స్వేచ్ఛనెప్పుడూ తనొక వరంగా భావించలేదు. తన జన్మహక్కనుకొన్నాడు. అలాకూడా అనుకోలేదు. అదే జీవిత మనుకున్నాడు. కాని దాని విశిష్టత ఇప్పుడు తెలుస్తోంది - చీకటి ఉంటేగాని వెలుగు మహాత్మ్యం తెలియనట్లు, దుఃఖం ఉంటేగాని సంతోషం విలువ అర్థంకానట్లు, ఆకలయితే గాని మృష్టాన్న భోజనపు రుచులు అనుభవానికి రానట్లు. ఒక్కనాడైనా తనకు ఆడజన్మాంతం ఖైదు అవుతుందని కలగన్నాడా ? "హాయ్ అల్లా" బేనజీర్ విశాల నేత్రాలనుండి కన్నీళ్ళు అవిరామంగా వర్షించాయి.

"దుపట్టా సరిగా వేస్కో బేటీ" అనే ఫాతిమా హెచ్చరింపుకు ఉలికిపడింది బేనజీర్. ఇప్పుడు పధ్నాలుగేండ్లుగా అలవాటుపడిన భాషకూడా మార్చుకోవాలి కాబోలు స్త్రీ లింగానికి. ఇటువంటి అనుభవం ఇంకెవరికైనా ఉంటుందా ? తన సన్నటి పెదవులు నవ్వుకొన్నాయి బాధగా. అందుకే కాబోలు మొదట్లో తనకు కమాల్ (అద్భుతం) అనీ, ఇప్పుడు బేనజీర్ (సాటిలేనిది) అనీ పేర్లు కుదిరాయి.

రాత్రి తొమ్మిదయి ఉంటుంది. కిటికీకి ఉన్న మందపాటి పరదాను కొదిగా తొలగించి చూసింది బేనజీర్. తన భవిష్యత్తులా బయట గాఢాంధకారం వ్యాపించింది. ఇంతలో ప్రక్క గదిలో నుండి తండ్రి మాటలు వినిపించాయి.

"బేనజీర్‌కు శాదీ (పెళ్ళి) ఎట్లా చెయ్యాలి ? ఇది ఏమి ముసీబతు(కష్టం) వచ్చింది ! లడ్‌కా లడ్‌కీగా మారిందంటే ఎవరు నమ్ముతారు ? కౌన్ శాదీ కరేగా ఇస్‌సే ? (దీని నెవరు పెళ్ళాడుతారు ?) ముఝే కుఛ్ భీ సమఝ్‌మే, నహిఁ ఆ రహాహై. కుఛ్ భీ .. (నాకేం అర్థం కావటం లేదు. ఏమీ..)

పాపం బేనజీరుకూ ఏమీ అర్థకావటం లేదు. గతం స్పష్టంగా, వర్తమానం అయోమయంగా, భవిష్యత్తు భయానకంగా ఉందనిపిస్తోంది.

*